E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com


ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 28-07-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ఆపరేషన్ సిందూర్‌పై చర్చ.. ఎంపీలకు అధికార, ప్రతిపక్షాల విప్ జారీ » 2లో


వడ్డీ రేట్లు తగ్గించడంలో ప్రైవేటు బ్యాంకుల ఆలస్యం » 4లో



దీపికా పదుకొణెకు మరో గౌరవం.. ఆ జాబితాలో చోటు » 5లో



సెట్స్‌పైకి స్పిరిట్ అప్పుడే! » 5లో




సెంచరీ చేసి ఔటైన శుభ్‌మన్ గిల్.. లంచ్ బ్రేక్.. భారత్ 223/4 » 6లో



# అంతరిక్షంపై చిన్నారుల్లో అమితాసక్తి

» శుభాంశు అంతరిక్ష యాత్ర విజయవంతం కావడం హర్షణీయం
» స్పేస్ సెక్టార్‌లో 200కుపైగా స్టార్టప్ కంపెనీలొచ్చాయి
» దేశ అభివృద్ధి కోసం స్వదేశీ ఉత్పత్తులే ఉపయోగిద్దాం
» 'మన్ కీ బాత్'లో మోదీ పిలుపు



ఈ కబురు: శివసత్తుల ఊరేగింపులు, పోతరాజుల విన్యాసాలు, తీన్మార్ డప్పులతో స్టెప్పులు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, జానపద గీతాలు.. ఎటు చూసినా భక్త జనసందోహం, సందడే సందడి... వెరసి భాగ్యనగరం ఆదివారం ఆషాడ బోనల జాతర శోభ సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ హైదరాబాద్ నగర వీధులన్నీ బోనాల ఉత్సవాలతో సందడిగా కనిపించాయి. హైదరాబాద్‌లో ఉన్న అన్ని అమ్మవారి ఆలయాల్లో బోనాల జాతరలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు అమ్మవార్లకు బోనం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అయితే, ప్రధాన ఆలయాల వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. లాల్‌దర్వాజాలోని సింహవాహని ఆలయం, హరిబౌలి అక్కన్నమాదన్న మహంకాళి, చార్మినార్ భాగ్యలక్ష్మి, గౌలిపురా కోటమైసమ్మ, బేలాచందూలాల్ ముత్యాలమ్మ, మీర్‌ఆలంమండి మహంకాళి, కార్వాన్‌దర్బార్ మైసమ్మ, ఎల్‌బీనగర్ ఖిల్లామైసమ్మ తదితర ఆలయాల్లో అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం పట్టు వస్త్రాలు సమర్పించింది. లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అక్కన్నమాదన్న ఆలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, గౌలిపురాలో మంత్రి వాకిటి శ్రీహరి, మీర్‌ఆలంమండి ఆలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎల్‌బీనగర్‌లోని ఖిల్లామైసమ్మ ఆలయంలో మంత్రి సీతక్క, ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాలిబండ బంగారు మైసమ్మ ఆలయంలో ప్రభుత్వం తరపున మేయర్ విజయలక్ష్మిపట్టువస్త్రాలు సమర్పించారు.

తరువాయి 2లో



## యూరియా విషయంలో ఆందోళన వద్దు

ఈ కబురు, కొత్తగూడెం: రైతులకు సరిపడా యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

తరువాయి 2లో

## దంపతులను నమ్మించి మోసం..

» 2లో



## కాళేశ్వరంపై కాంగ్రెస్‌వి తప్పుడు వ్యాఖ్యలు

» బీసీలకు న్యాయం చేసేది కేసీఆరే..
» భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



ఈ కబురు ,భూపాలపల్లి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఆయనకు ఎక్కడ మంచిపేరు వస్తుందోనన్న భయంతో కాంగ్రెస్ నేతలు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తే, ఇందులో రూ.లక్షల కోట్ల కుంభకోణం జరిగిందంటున్నారని విమర్శించారు.

తరువాయి 2లో

## తగ్గిన వాన.. పెరిగిన ఎండ




» తగ్గిన వాన.. పెరిగిన ఎండ
» కావలిలో 37.1 డిగ్రీల ఉష్ణోగ్రత
» శ్రీశైలం ఒక్కగేటు ద్వారా నీటి విడుదల
» గోదావరిలో పెరుగుతున్న వరద ప్రవాహం

ఈ కబురు ,రాష్ట్రంలో ఆదివారం ఎండతీవ్రత పెరిగింది. మూడు, నాలుగు రోజులపాటు వర్షా లు, జల్లులు, మేఘాలతో చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కింది. పగటి ఉష్ణోగ్రతలు శనివారం కంటే మూడు, నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కావలిలో 37.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జరిగిందంటున్నారని విమర్శించారు.

తరువాయి 3లో


## స్థానిక ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లు

» స్థానిక ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లు
» నేటి మంత్రివర్గ సమావేశంలో కీలక చర్చ
» ఆర్డినెన్స్ గవర్నర్ దగ్గర.. బిల్లులు కేంద్రం వద్ద..
» ఎలా ముందుకెళ్లాలనే దానిపై చర్చించి నిర్ణయం?



ఈ కబురు,హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ.. దీనికి ముడిపడి ఉన్న 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సోమవారం మంత్రివర్గ భేటీలో కీలక చర్చ జరగనుంది. బీసీ రిజర్వేషన్ల పెంపునకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సెక్షన్ 285(ఎ)ను సవరిస్తూ గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ రాజ్‌భవన్‌లోనే ఉంది. అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లులపై ఏ నిర్ణయమూ వెలువడలేదు. మరోవైపు రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు ఇచ్చిన గడువు పూర్తయింది. ఏడాదిన్నరకు పైగా స్థానిక ఎన్నికలు జరగక కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. వీటన్నింటి నేపథ్యంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై మంత్రివర్గం చర్చించనున్నట్టు తెలిసింది. రిజర్వేషన్ల విషయంలో జాప్యం జరుగుతుండటంతో.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయమేదైనా తీసుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇక కులగణనపై అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ.. ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక అందించింది. దీనిపై మంత్రివర్గ భేటీలో చర్చించి.. నివేదికలోని వివరాలను వెల్లడించే అవకాశం ఉందని తెలిసింది. ఈ అధ్యయనంలో వెల్లడైన వివరాలు, కులాల వారీగా ఇచ్చిన ర్యాంకులను బట్టి ఏయే చర్యలు తీసుకోవాలనేదానిపైనా ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. పలు ప్రభుత్వ శాఖల్లో కొన్ని పోస్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని తెలిసింది.

తరువాయి2లో



## ఛత్తీస్‌గఢ్‌లో నన్‌లు అరెస్టు.. జోక్యం చేసుకోవాలని ప్రధాని మోదీకి కేరళ సీఎం లేఖ

» 3లో



## నేడో రేపో పీసీ ఘోష్ కమిషన్ నివేదిక

» 2లో

## ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధారామం..

» 3లో



మొదటి పేజీ తరువాయి

# అంతరిక్షంపై చిన్నారుల్లో అమితాసక్తి



శుభాంశు శుక్ల అంతరిక్ష యాత్రతో దేశమంతా పులకించిపోయిందని, ఆయన క్షేమంగా తిరిగి వచ్చాక గర్వంతో ఉప్పొంగిపోయిందని, ప్రతి హృదయం సంతోషంతో నిండిపోయిందని వ్యాఖ్యానించారు. 2023 ఆగస్టులో చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైనప్పుడు భారతీయులు ఎంతగానో గర్వించారని గుర్తుచేశారు. చిన్నారుల్లో సైన్స్, అంతరిక్షం పట్ల ఆసక్తి పెరిగిందని, చంద్రుడిపైకి చేరుకుంటామని చెబుతున్నారని వెల్లడించారు. స్పేస్ సైంటిస్ట్ కావాలన్న ఆలోచన వారిలో నాటు కుందని, ఇదొక శుభ పరిణామమని ఉద్ఘాటించారు. 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

**ఒలింపియాడ్‌లో మన విద్యార్థుల ఘనత**

"చిన్నారుల్లో నూతన ఆవిష్కరణ పట్ల ఉత్సాహం పెంచడానికి ఇన్‌స్పైర్-మానక్ అభియాన్ ప్రారంభించాం. ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురిని ఎంపిక చేశాం. లక్షలాది మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో చేరారు. చంద్రయాన్-3 తర్వాత వారి సంఖ్య రెట్టింపయ్యింది. స్పేస్ స్టార్టప్‌లు ఐదేళ్ల క్రితం కేవలం 50 ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 200 దాటేసింది. 21వ శతాబ్దంలో నూతన శక్తితో సైన్స్ పురోగమిస్తోంది. కొన్ని రోజుల క్రితం ఇంటర్నేషనల్ కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో మన విద్యార్థులు దేవేశ్ పంకజ్, సందీప్ కుచీ, దేవదత్ ప్రియదర్శి, ఉజ్వల్ కేసరి పతకాలు గెలుచుకున్నారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్ లో మన విద్యార్థులు ఆరు పతకాలు సాధించారు.

**విప్లవాల మాసం ఆగస్టు**

ఆగస్టు రాబోతోంది. ఆగస్టు అంటే విప్లవాల మాసం. 18 ఏళ్ల స్వాతంత్ర్య సమర యోధుడు ఖుదిరాం బోస్‌ను ఆగస్టులోనే బ్రిటిష్ పాలకులు ఉరి తీశారు. లోకమాన్య బాల గంగాధర్ తిలక్ ఆగస్టు 1న మరణించారు. ఆగస్టు 8న గాంధీ నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమం మొదలైంది. ఆగస్టు 15న మనకు స్వాతంత్ర్యం వచ్చింది. దేశ విభజన కూడా ఇదే నెలలో జరిగింది. ప్రతిఏటా ఆగస్టు 14వ తేదీని 'విభజన అకృత్యాల సంస్మరణ దినం'గా నిర్వహించుకుంటున్నాం. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ఆరంభమైంది. స్వదేశీ ఉత్పత్తులు వాడాలన్న పిలుపునకు అప్పటి ప్రజలు స్పందించారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నాం.

**అదే మనందరి సంకల్పం**

మన దేశం మరింత అభివృద్ధి చెందాలంటే స్థానిక ఉత్పత్తులు విరివిగా ఉపయోగించాలి. మన దేశంలో తయారైన వస్తువులే విక్రయించాలి. అవే కొనుక్కోవాలి. అదే మనందరి సంకల్పం కావాలి. ఎందుకంటే వాటి తయారీ కోసం మనం స్వేదం చిందించాం. కొన్నిసార్లు కొన్ని విషయాలు కొందరికి అసాధ్యంగా కనిపిస్తాయి. కానీ, మనమంతా ఒక్కటై పని చేస్తే అసాధ్యాలే సుసాధ్యాలవుతాయి. అందుకు తగిన ఉదాహరణ స్వచ్ఛ భారత్ మిషన్. ఈ కార్యక్రమానికి 11 ఏళ్లు పూర్తి కాబోతున్నాయి. ఇదొక ప్రజా ఉద్యమంగా మారింది. స్వచ్ఛతను ప్రజలు తమ బాధ్యతగా భావిస్తున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ అవసరం ఇప్పటికీ ఉంది. 4,500 పట్టణాలు, నగరాలు ఇందులో భాగమయ్యాయి. 15 కోట్ల మందికిపైగా జనం పాలుపంచుకున్నారు. ఇది సాధారణ విషయం కాదు.

**ఒడిశాలో మాజీ నక్సలైట్ల విజయాలు స్ఫూర్తిదాయకం**

జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో మాజీ నక్సలైట్లు చేపల పెంపకంలో అద్భుత విజయాలు సాధిస్తున్నారు. హింసను వీడి మత్స్య రంగంలో ప్రవేశించారు. క్లిష్టమైన పరిస్థితుల్లోనూ అభివృద్ధి దీపం వెలిగించవచ్చని నిరూపించారు. కొన్నిసార్లు దట్టమైన చీకటి నుంచే ప్రకాశవంతమైన వెలుగు ఉద్భవిస్తుంది. గతంలో తుపాకులు పట్టుకొన్న నక్సలైట్లు ఇప్పుడు వలలు చేతబూని చేపల వేట సాగిస్తున్నారు. చక్కటి ఆదాయం పొందుతూ బతుకులు మార్చుకుంటున్నారు. ఈ విజయ గాథలు అందరికీ స్ఫూర్తిదాయకం.

మొదటి పేజీ తరువాయి

# యూరియా విషయంలో ఆందోళన వద్దు




ఈ కబురు, కొత్తగూడెం: రైతులకు సరిపడా యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరా సౌరవికాసం పథకం ద్వారా గిరిజన రైతులకు సోలార్ పంపులు, డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు ఉచితంగా అందిస్తామని... మూడేళ్లలో ఇందుకోసం రూ.12,600 కోట్లు వెచ్చిస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ యూరియా కొరత ఉన్నట్టు జరిగే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు. ఆగస్టు రెండో వారంలో చేపపిల్లల పంపిణీ చేపడతామని, చెరువు గట్లపై వాటిలో పెంచే చేపపిల్లల వివరాలను ఉంచుతామని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా రైతులకు సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూశాఖలో అవకతవకలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టులో శ్రావణ మాసం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రులు, వసతిగృహాల పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించి, ప్రతినెలా వాటిని సందర్శించి నివేదికలు అందించాలన్నారు. సమీక్షలో ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, ఉభయ జిల్లాల ఎమ్మెల్యేలు, అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య, నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయబాబు, ఉభయ జిల్లాల ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఆపరేషన్ సిందూర్‌పై చర్చ..

## ఎంపీలకు అధికార, ప్రతిపక్షాల విప్ జారీ



**ఈ కబురు,ఢిల్లీ: కీలక చర్చకు సోమవారం పార్లమెంట్ వేదిక కానుంది. రేపటి నుంచి 2 రోజులపాటు ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అధికార ప్రతిపక్ష పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ఉభయసభల సభ్యులూ తప్పనిసరిగా సభలకు హాజరుకావాలని సూచించాయి. ప్రతిపక్షాలు లేవనెత్తిన డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా స్పందించడంతో.. సోమవారం నుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగే అవకాశముంది.**

**బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు ప్రతిరోజూ ఆందోళన చేస్తుండటంతో పార్లమెంటు ఉభయ సభలు వరుసగా వాయిదా పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తన ఛాంబర్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించి.. అర్థవంతమైన చర్చలు జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్'పై సోమవారం నుంచి లోక్‌సభలో చర్చకు అనుమతిస్తున్నట్లు ఆయన వెల్లడించడంతో ప్రతిపక్షాలు కూడా పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యాయి. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన ప్రధాని మోదీ సోమవారం సభకు వచ్చే అవకాశం ఉంది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ ఈ చర్చల్లో పాల్గొననున్నారు.**

మొదటి పేజీ తరువాయి

# దంపతులను నమ్మించి మోసం..



ఈ కబురు, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు సరైన అనుమతులు లేవని డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఆ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరిందని చెప్పారు. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ వ్యవహారంపై ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలు విషయాలను డీసీపీ వెల్లడించారు. సంతానం కలగని దంపతులను ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత మోసగించారని చెప్పారు. "సంతానం కలగకపోవడంతో రాజస్థాన్‌కు చెందిన దంపతులు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు వెళ్లారు. దంపతులకు డాక్టర్ నమ్రత పలు పరీక్షలు నిర్వహించి ఐవీఎఫ్ సాధ్యం కాదని.. సరోగసీ ద్వారా పొందవచ్చని చెప్పారు. రూ.30లక్షలు ఖర్చు అవుతుందన్నారు. సరోగసీ కోసం విశాఖకు చెందిన దంపతులను ఒప్పించానని నమ్రత చెప్పారు. వారు రూ.5లక్షలు అడిగారని తెలిపారు. దంపతుల నుంచి అండం, వీర్యం సేకరించి సరోగసీ చేస్తున్నామన్నారు. విశాఖలోని ఓ గర్భిణిని సరోగసీ మదర్ అని చూపించారు.


**అనుమానంతో డీఎన్ఏ టెస్టు చేస్తే..**

కొన్నాళ్ల తర్వాత విశాఖ ఆస్పత్రిలో ఓ బాబును దంపతులకు ఇచ్చారు. సరోగసీకి అంగీకరించిన మహిళ అదనంగా డబ్బు అడుగుతున్నారన్నారు. డాక్టర్ అడిగిన అదనపు డబ్బులు కూడా దంపతులు ఇచ్చారు. ఈ కేసులో నమ్రత అసలు సరోగసీ చేయలేదు. శిశువు వద్దనుకున్న అస్సాంకు చెందిన ఒక మహిళకు రూ.90వేలు చెల్లించారు. ఆమెకు శిశువు పుట్టగానే తీసుకున్నారు. ఆ తర్వాత దంపతులకు అనుమానం వచ్చింది. దీంతో డీఎన్ఏ టెస్టు చేయించారు. ఈ క్రమంలో శిశువు ఆ దంపతులకు చెందినది కాదని తేలింది.

**డాక్టర్, సిబ్బంది సరైన నిపుణులు కాదు**

సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు చాలా నిబంధనలు ఉల్లంఘించారు. ఆ ఆస్పత్రికి సరైన అనుమతులు లేవు.. చాలా ఫిర్యాదులు కూడా ఉన్నాయి. డాక్టర్, సిబ్బంది ఎవరూ సరైన నిపుణులు కాదు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌కు 2021లోనే గడువు తీరింది. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నారు. దీనిపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. అందుకే ఆస్పత్రిని మూసివేస్తున్నట్లు కోర్టుకు చెప్పారు. ఆస్పత్రిని చాటుమాటుగా నిర్వహిస్తున్నందున అధికారులు గుర్తించలేకపోయారు. ఇది సరోగసీ కాదు.. చైల్డ్ ట్రాఫికింగ్. న్యాయవాదినని చెప్పుకొని నమ్రత కుమారుడు జయంత్ కృష్ణ బాధితులను బెదిరించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశాం. ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేశాం" అని డీసీపీ రష్మీ పెరుమాళ్ వివరించారు.

# స్థానిక ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లు



ఈ కబురు,హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ.. దీనికి ముడిపడి ఉన్న 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సోమవారం మంత్రివర్గ భేటీలో కీలక చర్చ జరగనుంది. బీసీ రిజర్వేషన్ల పెంపునకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం2018 సెక్షన్ 285(ఎ)ను సవరిస్తూ గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ రాజ్‌భవన్‌లోనే ఉంది. అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లులపై ఏ నిర్ణయమూ వెలువడలేదు. మరోవైపు రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు ఇచ్చిన గడువు పూర్తయింది. ఏడాదిన్నరకు పైగా స్థానిక ఎన్నికలు జరగక కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. వీటన్నింటి నేపథ్యంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై మంత్రివర్గం చర్చించనున్నట్టు తెలిసింది. రిజర్వేషన్ల విషయంలో జాప్యం జరుగుతుండటంతో.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయమేదైనా తీసుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇక కులగణనపై అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ.. ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక అందించింది. దీనిపై మంత్రివర్గ భేటీలో చర్చించి.. నివేదికలోని వివరాలను వెల్లడించే అవకాశం ఉందని తెలిసింది. ఈ అధ్యయనంలో వెల్లడైన వివరాలు, కులాల వారీగా ఇచ్చిన ర్యాంకులను బట్టి ఏయే చర్యలు తీసుకోవాలనేదానిపైనా ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. పలు ప్రభుత్వ శాఖల్లో కొన్ని పోస్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని తెలిసింది.

**యూరియా నిల్వలు.. సాగునీటి ప్రాజెక్టులపై..**

ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందని, తగినంత సరఫరా చేయడం లేదని ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తున్నాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అవసరానికి తగిన మేర యూరియా ఇవ్వడంలేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ క్రమంలో అసలు రాష్ట్రానికి ఖరీఫ్, యాసంగి సీజన్లలో ఎంతెంత యూరియా అవసరం? ప్రస్తుత ఖరీఫ్‌కు కేంద్రం ఎంత కేటాయించింది? ఇప్పటివరకు ఎంత సరఫరా చేసింది? యూరియా నిల్వల విషయంలో తీసుకోవాల్సిన చర్యలేమిటన్న అంశాలపై మంత్రివర్గం సమీక్షించనున్నట్టు సమాచారం. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, సీతారామ ప్రాజెక్టు సవరించిన అంచనాలపై చర్చించనున్నట్టు తెలిసింది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం ఏర్పాటైన పీసీ ఘోష్ కమిటీ.. ప్రభుత్వానికి నివేదిక అందజేసే అవకాశం ఉందని సమాచారం. మంత్రివర్గ భేటీకి ముందే నివేదిక అందితే దానిపైనా లోతుగా చర్చించనున్నట్టు తెలిసింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వానలు, జలాశయాల్లో నీటి నిల్వ, కొత్త రేషన్‌కార్డులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ అనుసంధానం, మైనింగ్ శాఖలో కీలకమైన సీనరేజీ చార్జీల్లో పలు మార్పులు, అధునాతన గోశాలల నిర్మాణంపై మంత్రివర్గంలో సమీక్షించనున్నారు. పటాన్‌చెరు సిగాచి పరిశ్రమ ప్రమాదంపై విచారణ కమిటీ తాజాగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని, దానిపై చర్చించే అవకాశం ఉందని తెలిసింది.

# కాళేశ్వరంపై కాంగ్రెస్‌వి తప్పుడు వ్యాఖ్యలు



ఈ కబురు ,భూపాలపల్లి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఆయనకు ఎక్కడ మంచిపేరు వస్తుందోనన్న భయంతో కాంగ్రెస్ నేతలు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తే, ఇందులో రూ.లక్షల కోట్ల కుంభకోణం జరిగిందంటున్నారని విమర్శించారు. 'కాళేశ్వరం' కేసీఆర్ సొత్తు కాదని, అది ప్రజల ఆస్తి మాత్రమేనన్నారు. గతంలో బీసీలకు న్యాయం చేసింది, భవిష్యత్తులో బహుజనులకు సరైన ప్రాధాన్యం ఇచ్చేది కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా పరకాలలో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కేటీఆర్ మహిళలకు కుట్టుమిషన్లు, కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. మొగుళ్లపల్లిలో మాజీ సర్పంచి కొంరయ్య విగ్రహావిష్కరణలో, భూపాలపల్లిలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలోనూ ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో కేటీఆర్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ప్రజలు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే.. నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీళ్లు ఏపీ సీఎం చంద్రబాబుకు, నిధులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి, నియామకాలు చంద్రబాబు తొత్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, భాజపాలు కలసి భవిష్యత్తులో సింగరేణి సంస్థను కూడా ప్రైవేటీకరిస్తాయన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా నాగర్‌కర్నూల్ గురుకుల విద్యాలయంలోని 111 మంది విద్యార్థినులు కలుషితాహారం తిని అస్వస్థులయ్యారని.. సీఎం జిల్లాలోనే ఇంత దారుణం జరిగితే.. మిగతా జిల్లా హాస్టళ్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో కొందరు కాంగ్రెస్ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ ఉన్నంత కాలం భారాస ఉంటుందని.. ఎవరితోనూ కలిసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులంతా సమన్వయంతో పనిచేస్తే అన్ని మండలాల్లో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపనేని నరేందర్, భారాస భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నేడో రేపో పీసీ ఘోష్ కమిషన్ నివేదిక

ఈ కబురు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై సుదీర్ఘ విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఒకటిరెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. జస్టిస్ చంద్రఘోష్ ఆదివారం హైదరాబాద్‌కు చేరుకోగా, ఆయనకు విమానాశ్రయంలో నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఎన్సీ కె.శ్రీనివాస్, సీఈ విజయ్‌భాస్కర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ నెలాఖరుతో కమిషన్ గడువు ముగియనుండగా, ఆలోపే ప్రభుత్వానికి నివేదికను సమర్పించేందుకు జస్టిస్ ఘోష్ ఏర్పాట్లు చేసుకున్నారు.నివేదికలోని అంశాలు బయటకి పొక్కకుండా అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్ కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడి నీళ్లు సీపేజీ అయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలతో పాటు అవినీతి ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 16 నెలలకు పైగా విచారణ నిర్వహించింది.



# ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి..



ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రవి కుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి

### గౌలిదొడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించిన రవి కుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, క్రమం తప్పకుండా ఏడాదికోసారి పూర్తి వైద్య పరీక్షలు చేయించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిలు పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ లోగల గౌలిదోడి గ్రామంలో ఆదివారం సేవాభారతి ఎల్విహెచ్ గ్రీన్ ల్యాండ్స్ డా.ఈశ్వర్ చందర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఆదివారం మధ్యాహ్నం రవి కుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అందుబాటులో ఉన్న సేవలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ విధమైన సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యం మీద దృష్టి కేంద్రీకరించాలని, ఏడాదికి ఒక్కసారైనా పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏ వ్యాధినైనా ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే ఉపయోగం ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామంతో రోగాల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా త్రిమూర్తులు పొన్నాడ

### ప్రైవేటు స్కూళ్లలో విద్యా ప్రమాణాలు మరింత పెంచేందుకు కృషి : త్రిమూర్తులు పొన్నాడ



లయన్ త్రిమూర్తులు పొన్నాడ

ఈ-కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండల పరిధిలో గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూల్స్ కరస్పాండెంట్ అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శిగా విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్, లయన్ డాక్టర్ పొన్నాడ త్రిమూర్తులు ఎన్నికయ్యారు. శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్ అసోసియేషన్ ఎన్నికలను ఆదివారం ఆల్విన్ కాలనీలోని అశోక గ్రాండ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రైవేటు స్కూల్స్ కరస్పాండెంట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పవన్ కుమార్ ఎన్నికవ్వగా, ప్రధాన కార్యదర్శిగా పొన్నాడ త్రిమూర్తులు, కోశాధికారిగా శ్రీనివాసరెడ్డిలను అసోసియేషన్ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శి పొన్నాడ త్రిమూర్తులు మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల పరిధిలో ప్రైవేటు విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఎల్లవేళలా కృషి చేస్తుందని, ప్రైవేటు విద్యాసంస్థల అభివృద్ధికి పాటుపడుతుందని తెలిపారు. మండల పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు కృషి చేస్తామన్నారు. క్రమం తప్పకుండా అసోసియేషన్ కార్యవర్గ సమావేశాలను నిర్వహించి మండల పరిధిలోని ప్రైవేట్ విద్యాసంస్థల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదని, ఉత్తమ విద్యను అందించి భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై, విద్యాసంస్థలపై ఉంటుందన్నారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లు, అతిథులు భారీ ఎత్తున హాజరు కావడం కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతుందన్నారు.

# ఆయన మంచి రైటర్.. ఇక్కడ మంచి ఫైటర్ కావాలి: రాజాసింగ్



ఈ కబురు,హైదరాబాద్: తాను పార్టీకి రాజీనామా చేయడంలో ఎలాంటి కుట్ర లేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. గత కొద్ది రోజులుగా ఎమ్మెల్యే రాజాసింగ్ తిరిగి బీజేపీలో చేరనున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆ ప్రచారాన్ని ఖండించారు. తాను బీజేపీలో చేరడం లేదని వ్యాఖ్యానించారు. ఈమేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు హాట్ కామెంట్స్ చేశారు."రామచందర్ రావు మంచి రైటర్. కానీ తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే మంచి ఫైటర్ కావాలి. నా రాజీనామా వెనక కుట్ర లేదు. వేరే పార్టీ నుంచి బీజేపీలో చేరిన వారికి అన్యాయం చేస్తున్నారు. ఈ అన్యాయంపై కేంద్ర పార్టీకి చెప్పాలని అనుకుంటున్నా. నా రాజీనామాను కేంద్ర పార్టీ ఆమోదించడం వెనక కుట్ర జరిగింది. నా పార్టీలో చేరడానికి నేను ప్రయత్నం చేయడం లేదు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఎం చేయాలో కేంద్ర పార్టీకి వివరించాలని ఉంది.

హోంశాఖ మంత్రి అమిత్ షా నాకు ఫోన్ చేయలేదు. తెలంగాణ బీజేపీలో జరుగుతున్న తప్పిదాలపై కేంద్రానికి లేఖ రాశా.. మెయిల్స్ చేశాను. వారి దృష్టికి వెళ్ళిందో లేదో.. తెలియదు. బేగంపేట ఎయిర్‌పోర్టులో కలిసినప్పుడు అమిత్ షాకు కలుస్తానని చెప్పాను.. ఆ లోపే రాజీనామా చేశాను.తెలంగాణలో 2014, 2018, 2023 ఎన్నికల్లో బీజేపీకి ఎవరు మోసం చేశారో, ఎవరు వెనక నుంచి కత్తిపోట్లు పొడిచారో ఐబీ రిపోర్ట్ కేంద్ర పార్టీ తెప్పించుకోవాలి. కొంతమంది బీజేపీ మహిళానేతలకు దండం. వారికి సన్మానం చేస్తా. నా ఉద్దేశ్యం ఒక్కటే బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రావడమే. నాకు అమిత్ షా ఫోన్ చేశారని యూట్యూబ్ ఛానళ్లలో ఫేక్ వార్తలు పెట్టించి రాజీనామా ఆమోదించేలా చేశారు. ఫేక్ వార్తలు, మీడియాలో లీకులు ఇచ్చే అలవాటు నాకు లేదు.. అటువంటి చిన్న ఆలోచన నేను చేయను"అని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల ఉత్సవాలు : ఎమ్మెల్యే గాంధీ



బోనాల ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాల ఉత్సవాలు నిలుస్తాయని తెలంగాణ రాష్ట్ర పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఉస్మాన్ నగర్ గ్రామంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు ఎంతో ప్రత్యేకత ఉందని, మన రాష్ట్ర సాంప్రదాయానికి బోనాలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. తమను చీడ,పీడల నుంచి దూరం చేయాలని కోరుతూ గ్రామ దేవతలను వేడుకుంటూ నిర్వహించే బోనాల ఉత్సవాల సాంప్రదాయం అనాదిగా వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని పోచమ్మ తల్లి అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో బోనాల ఉత్సవాలను ప్రజలందరూ వైభవంగా నిర్వహించుకునేందుకు ప్రతి గుడికి బోనాల నిధులను అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఏ ఇబ్బందులు లేకుండా బోనాల ఉత్సవాలు నిర్వహించుకోవడం కోసం నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# తగ్గిన వాన.. పెరిగిన ఎండ

- తగ్గిన వాన.. పెరిగిన ఎండ
- కావలిలో 37.1 డిగ్రీల ఉష్ణోగ్రత
- శ్రీశైలం ఒక్కగేటు ద్వారా నీటి విడుదల
- గోదావరిలో పెరుగుతున్న వరద ప్రవాహం



ఈ కబురు, రాష్ట్రంలో ఆదివారం ఎండతీవ్రత పెరిగింది. మూడు, నాలుగు రోజులపాటు వర్షాలు, జల్లులు, మేఘాలతో చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కింది. పగటి ఉష్ణోగ్రతలు శనివారం కంటే మూడు, నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కావలిలో 37.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురు వర్షాలు కురుస్తాయని, ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవన కరెంట్ బలంగా ఉండడంతో కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. రానున్న 48 గంటలు ఉత్తరకోస్తాలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని వాతావరణ నిపుణుడొకరు హెచ్చరించారు. ఆగస్టు తొలి వారంలో రుతుపవనద్రోణి తూర్పుభాగం దక్షిణాదివైపునకు వచ్చే అవకాశం ఉన్నందున కోస్తాలో వర్షాలు పెరుగుతాయన్నారు. కాగా, కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదుల్లో వరద ప్రవాహం పూర్తి స్థాయిలో తగ్గే వరకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. శనివారం రెండు గేట్లు ఎత్తిన అధికారులు ఆదివారం ఒక గేటును మూసివేశారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి శ్రీశైలానికి 1,18,274 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ఒక్క గేటు ఎత్తి 66,417 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882 అడుగులకు చేరుకుంది. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 198.81 టీఎంసీల నీరు ఉంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 93,115 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్‌లో నీటి మట్టం 584అడుగులకు చేరింది. ఇది 291.37 టీఎంసీలకు సమానం. పులిచింతల ప్రాజెక్టులో 20.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 26,430 క్యూసెక్కుల నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది.ఇక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఉప నదులు శబరి, సీలేరు, మంజీర, ప్రవర, పర్ణ, ఇంద్రావతి నుంచి అదనంగా వస్తున్న 6,89,258 క్యూసెక్కుల వరదను పోలవరం స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 35.00 అడుగులకు చేరింది. ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ 175 గేట్లను 1.5 మీటర్లు ఎత్తి 6,18,044 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది.

# ఛత్తీస్‌గఢ్‌లో నన్‌లు అరెస్టు..

## జోక్యం చేసుకోవాలని ప్రధాని మోదీకి కేరళ సీఎం లేఖ

ఈ కబురు ,తిరువనంతపురం: మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడి కేసులో కేరళకు చెందిన ఇద్దరు క్యాథలిక్ నన్‌లు, మరొక మహిళను ఛత్తీస్‌గఢ్ రైల్వే పోలీసులు అరెస్టు చేయడంపై కేరళ సీఎం పినరయి విజయన్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, వారికి న్యాయం చేయాలని కోరారు. మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదు అందడంతో సిస్టర్ వందనా ఫ్రాన్సిస్, సిస్టర్ ప్రీతిలను దుర్గ్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అయితే కాన్వెంట్‌లో జాబ్ రావడంతోనే వారిని తీసుకెళ్లడానికి నన్‌లు అక్కడికి వెళ్లినపుడు పోలీసులు అరెస్టు చేసినట్లు లేఖలో సీఎం విజయన్ పేర్కొన్నారు. వారిని కస్టడీలోకి తీసుకోవడంతో వారి బంధువులు ఆందోళన చెందుతున్నారని, సంప్రదింపులు జరిపేందుకు వీలు లేకుండా ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో ప్రధాని మోదీ నేరుగా జోక్యం చేసుకోవాలని, విచారణ పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. ఈమేరకు ఆ రాష్ట సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఈ ఘటనపై భాజపా, సంఘ్ పరివార్‌ను కేరళ కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. మైనారిటీలపై భాజపా ప్రభుత్వాలు దాడులు చేస్తున్నాయనడానికి ఇదే తాజా ఉదాహరణ అని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, కేరళ కాంగ్రెస్ ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ దుయ్యబట్టారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్య ప్రదేశ్ వంటి భాజపా ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో మైనారిటీలపై దాడులు పెరిగాయని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. నన్‌ల అరెస్టుకు సంబంధించి భజరంగ్‌దళ్ సభ్యులే బాధ్యులని, వారికి అధికార పార్టీలు మద్దతు పలుకుతున్నాయన్నారు. ఈ విషయంపై కేంద్ర హోంమంత్రి, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి తాను లేఖ రాశానని తెలిపారు. నన్‌ల అరెస్టుకు సంబంధించి నేరస్థులపై చర్యలు చేపట్టాలని, మైనారిటీల ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా రాజ్యాంగాన్ని కాపాడాలని కోరారు.




# ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధారామం.. చైనా 'పీఠాధిపతి' అక్రమ సంబంధాలు వెలుగులోకి!



ఈ కబురు: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన చైనా లోని ఓ బౌద్ధారామం తాజాగా వార్తల్లో నిలిచింది. మార్షల్ ఆర్ట్స్‌కు ప్రసిద్ధి చెందిన ఈ ఆలయ అధిపతిపై నేరారోపణలు వచ్చాయి. నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతోపాటు అనేక మంది మహిళలతో ఆయన అక్రమ సంబంధాలు పెట్టుకున్నట్లు తెలిసింది. ఆయన బౌద్ధ నియమాలను ఉల్లంఘించారని, ఈ వ్యవహారంపై దర్యాప్తు మొదలుపెట్టినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.హెనాన్ ప్రావిన్సులో షావోలిన్ ఆలయం ఉంది. కుంగ్ ఫూ శిక్షణకు చాలా ప్రసిద్ధి. షి యోంగ్సిన్ అనే వ్యక్తి దీనికి అధిపతిగా కొనసాగుతున్నారు. అయితే, ఆయనపై ఆలయ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. చాలాకాలంగా అనేక మంది మహిళలతో లైంగిక సంబంధాలు కొనసాగిస్తున్నారని, అక్రమంగా ఓ చిన్నారికి తండ్రి అయినట్లు గుర్తించారు. ఇవి బౌద్ధ సూత్రాలను ఉల్లంఘించడమేనని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. పలు విభాగాల అధికారులు ఆయన్ను విచారిస్తున్నారని, సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు వెల్లడిస్తామని తెలిపాయి.సాంగ్ పర్వతం దిగువున ఉన్న ఈ క్షేత్రాన్ని క్రీ.శ 495లో స్థాపించారు. 1500 ఏళ్ల నాటి ఈ ఆలయానికి చారిత్రక, మతపరమైన ప్రాముఖ్యంతోపాటు మార్షల్ ఆర్ట్స్ కూ ప్రసిద్ధిగాంచింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థులు ఇక్కడకు వచ్చి శిక్షణ తీసుకుంటారు. పర్యాటకంగానూ ఎంతో ప్రాచుర్యం పొందింది.చైనాలో ప్రసిద్ధ సన్యాసుల్లో ఒకరైన షి యోంగ్సిన్ పై గతంలోనూ ఆరోపణలు వచ్చాయి. ఎంబీఏ చదివిన ఆయన 1999 షావోలిన్ ఆలయానికి అధిపతిగా నియమితులయ్యారు. వాణిజ్య పరంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో 'సీఈవో మాంక్'గాను ప్రసిద్ధి చెందారు. స్థానిక ప్రభుత్వం నుంచి ఓ లగ్జరీ కారును బహుమానంగా పొందారంటూ 2006లో విమర్శలు ఎదుర్కొన్నారు. ఆస్ట్రేలియాలో కోట్ల రూపాయలతో ఆలయం, ఓ హోటల్, కుంగ్ ఫూ అకాడమీతోపాటు గోల్ఫ్ కోర్స్ నిర్మించాలని 2015లో ఓ ప్రణాళిక రూపొందించడం వివాదాస్పదమైంది.

# ఉక్రెయిన్ డ్రోన్ల భయం..

## రష్యా నేవీ పరేడ్‌లు రద్దు!



ఈ కబురు: యుద్ధంలో భాగంగా కొంతకాలంగా ఉక్రెయిన్ సైతం రష్యా పై డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఇటీవల ఆపరేషన్ 'స్పైడర్ వెబ్'తో మాస్కోను హడలెత్తించింది. ఈ పరిణామాల నేపథ్యంలో.. కీవ్ డ్రోన్ దాడుల భయంతో రష్యా ఆదివారం తన యుద్ధనౌకల పరేడ్‌లను రద్దు చేసినట్లు తెలుస్తోంది. భద్రతాపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు.రష్యా గత నాలుగు రోజులుగా దాదాపు 150 యుద్ధనౌకలతో విన్యాసాలు నిర్వహించింది. నేవీ డే వార్షిక వేడుకలు పురస్కరించుకుని నేడు రేవు నగరాలైన సెయింట్ పీటర్స్‌బర్గ్, కాలినిన్‌గ్రాడ్, వ్లాదివొస్తోక్‌లలో యుద్ధనౌకల పరేడ్ నిర్వహించాల్సింది. అయితే.. భద్రతాపరమైన కారణాలతో అధికారులు వీటిని రద్దు చేశారు. దేశాధినేత పుతిన్ ఇప్పటికే సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో పర్యటిస్తున్నారు. నేవీ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించిన ఆయన.. నౌకాదళ విన్యాసాల గురించి ఆరా తీశారు. మరిన్ని యుద్ధనౌకలు నిర్మిస్తామని, నేవీ శిక్షణను ముమ్మరం చేస్తామని.. తద్వారా పోరాట సామర్థ్యాన్ని పెంచుతామని చెప్పారు.మరోవైపు.. ఉక్రెయిన్ ప్రయోగించిన 99 డ్రోన్లను కూల్చేశామని రష్యా రక్షణశాఖ తెలిపింది. నేడు సెయింట్ పీటర్స్‌బర్గ్ సమీపంలో మరిన్ని డ్రోన్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. డ్రోన్ల ముప్పుతో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని పుల్కోవో విమానాశ్రయం ఆదివారం తెల్లవారుజామున పదుల కొద్ది విమానాలను నిలిపివేసింది. ఇదిలా ఉండగా.. యుద్ధం మొదట్లో నల్ల సముద్రంలో మోహరించిన పలు రష్యన్ యుద్ధనౌకలను ఉక్రెయిన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీంతో క్రిమియాలోని తన నౌకాదళ ఫ్లీట్‌ను రష్యా నోవోరోసిస్క్‌కు తరలించింది.




## హైదరాబాద్‌కు ఐసీఐసీఐ లాంబార్డ్ 'డిజాస్టర్ రికవరీ' మార్పు

**న్యూఢిల్లీ:** బీమా రంగ సంస్థ ఐసీఐసీఐ లాంబార్డ్ తమ డిజాస్టర్ రికవరీ మౌలిక సదుపాయాలను అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో ఆసియా-పసిఫిక్ (ముంబై) నుంచి ఆసియా పసిఫిక్ (హైదరాబాద్) రీజియన్‌కు అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించింది.
నిర్వహణపరమైన రిస్కులను సమర్థంగా ఎదుర్కొంటూ, కస్టమర్లకు నిరాటంకంగా సేవలు అందించేందుకు ఇది సహాయపడగలదని పేర్కొంది. టెక్నాలజీపరమైన అంతరాయాలు, అంతర్జాతీయంగా ఐటీ పరిశ్రమలో రిస్క్‌లు పెరుగుతున్న నేపథ్యంలో డౌన్‌టైమ్‌ను గణనీయంగా తగ్గించడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు సంస్థ తెలిపింది.

# మస్క్ ఆర్థిక సామ్రాజ్యం మనోడి చేతిలో.. ఎవరీ వైభవ్ తానేజా?

**ప్రపంచ అపర కుబేరుడు ఎలాన్ మస్క్ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు ఆర్థిక భారత సంతతికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ వైభవ్ తనేజా. ప్రస్తుతం టెస్లా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ)గా ఉన్న ఆయనకు ఇప్పుడు మరింత పెద్ద బాధ్యతలు అప్పగించారు మస్క్. కొత్తగా ప్రకటించిన రాజకీయ వెంచర్ అయిన అమెరికా పార్టీకి వైభవ్ తానేజాను ట్రెజరర్, రికార్డుల కస్టోడియన్‌గానూ చేశారు. సంప్రదాయ ఐఐటీ-ఐఐఎం నుంచి వచ్చినవాడు కాకపోయినా తనేజా రూ.1,100 కోట్ల వేతన పరిహారాన్ని అందుకుంటున్నారని ది వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.**





తనేజా అధికారికంగా అమెరికా పార్టీ ఆర్థిక వ్యవహారాల బాధ్యతలు చేపట్టినట్లు ఇటీవల ఫైనాన్షియల్ ఎక్స్ ప్రెస్ నివేదిక ధృవీకరించింది. ఈ పాత్రలో ఆయన రాజకీయ నిధులు, బడ్జెట్ పంపిణీని పర్యవేక్షించడం, ఆర్థిక చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు. ఇది కార్పొరేట్ ఫైనాన్స్ లో ఆయన ప్రస్తుత పాత్ర నుండి రాజకీయ రంగానికి గణనీయమైన మార్పును సూచిస్తుంది. తనేజాపై ఉన్న నమ్మకంతో మస్క్ ఇప్పుడు తన రాజకీయ పార్టీ ఆర్థిక బాధ్యతలనూ అప్పగించారు.

**ఢిల్లీ యూనివర్సిటీ నుంచి మొదలై..**

వైభవ్ తనేజా ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఫైనాన్స్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 1999 లో కామర్స్ లో పట్టభద్రుడయ్యారు. ఆ తర్వాతి సంవత్సరం చార్టర్డ్ అకౌంటెంట్ గా అర్హత సాధించారు. 2006లో అమెరికా వెళ్లి సర్టిఫైడ్ పబ్లిక్ అకౌంటెంట్ (సీసీఏ) అయ్యారు. ఇదే ఆయన ప్రపంచ ఆర్థిక జీవితాన్ని విస్తరించింది.ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ (పీడబ్ల్యూసీ)లో ఆయన దాదాపు 17 సంవత్సరాలు పని చేశారు. అక్కడాయన 500 మందికి పైగా క్లయింట్లకు రెగ్యులేటరీ ఫైలింగ్స్, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, ఐపీఓలను నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన రంగంలోకి ఆయన ప్రవేశం 2016లో సోలార్సిటీతో జరిగింది. ఈ సంస్థ తరువాత టెస్లాలో విలీనమైంది.

**రూ.1,100 కోట్ల వేతనం**

2017లో టెస్లాలో చేరిన తనేజా క్రమంగా ఎదుగుతూ 2023లో ఆ సంస్థకు సీఎఫ్ఓ అయ్యారు. 2024లో ఆయన 139.5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1,157 కోట్లు) వేతన పరిహారం అందుకున్నారు. ఇందులో మూల వేతనంగా అందుకున్నది 4 లక్షల డాలర్లే అయినప్పటికీ మిగిలినది స్టాక్ ఆప్షన్లు, ఈక్విటీ అవార్డుల ద్వారా వచ్చింది. టెస్లా ఇండియా మోటార్స్ అండ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ లో డైరెక్టర్ గా కూడా తానేజా పనిచేశారు.




## వడ్డీ రేట్లు తగ్గించడంలో ప్రైవేటు బ్యాంకుల ఆలస్యం

**ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాలన్న ఫాడా**

**దిల్లీ:** రెపో రేటు కోత ప్రయోజనాన్ని వాహన రుణాలు తీసుకున్న వారికి బదిలీ చేయడంలో ప్రైవేటు రంగ బ్యాంకులు ఆలస్యం చేస్తున్నాయని వాహన డీలర్ల సంఘాల సమాఖ్య(ఫాడా) ఆరోపించింది. ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జోక్యం చేసుకోవాలని కోరుతూ, బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాసింది. వాహన రుణ స్వీకర్తలకు వడ్డీ రేట్లను సత్వరం తగ్గించేలా ప్రైవేటు బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశాలు ఇవ్వాలని కోరింది. 'మీ నాయకత్వంలో ఆర్‌బీఐ తన చరిత్రలోనే అత్యంత వేగవంతంగా రెపోరేటు తగ్గించి, ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతాలను స్పష్టంగా ఇచ్చింది. అయినా వాహన రిటెయిల్ రంగానికి ఈ ప్రయోజనం పూర్తిగా అందలేదు. ప్రభుత్వ రంగ బ్యాంకులు రెపో రేటు కోత ప్రయోజనాన్ని సత్వరం తమ ఖాతాదార్లకు బదిలీ చేసినా, ప్రైవేటు రంగ బ్యాంకులు మాత్రం ఆలస్యం చేస్తున్నాయ'ని ఫాడా వైస్ ప్రెసిడెంట్ సాయి గిరిధర్ పేర్కొన్నారు. దీన్ని సరిచేయాలని కోరారు.

# 'నచ్చిన దేశం వస్తువును ఎంచుకునేలా!'.. ఇ-కామర్స్‌లో కొత్త ప్రతిపాదన

**రూ.2.58 లక్షల కోట్ల పబ్లిక్ ఇష్యూలు జాబితాలో టాటా కేపిటల్, ఎల్‌జీ, ఫోన్‌పే, మీషో**

**దిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలోనూ పబ్లిక్ ఇష్యూల సందడి హోరెత్తనుంది. తొలి పబ్లిక్ ఆఫర్‌ల (ఐపీఓ) ద్వారా మొత్తంగా రూ.2.58 లక్షల కోట్ల నిధులు సమీకరించేందుకు కంపెనీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే రూ.1.15 లక్షల కోట్ల ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ అనుమతి ఇవ్వగా.. మరో రూ.1.43 లక్షల కోట్ల నిధుల సమీకరణకు సంబంధించి సెబీ అనుమతి కోసం కంపెనీలు ఎదురు చూస్తున్నాయి. జనవరిలో స్టాక్‌మార్కెట్లు ఒడుదొడుకులను ఎదుర్కొన్నా, తదుపరి రాణిస్తుండటం.. మదుపర్ల నుంచి ఐపీఓలకు విశేష ఆదరణ లభిస్తుండటం, దేశీయంగా సానుకూల ఆర్థిక పరిస్థితుల వంటి అంశాలు కంపెనీల ఉత్సుకతకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. మ్యూచువల్ ఫండ్ సంస్థల పెట్టుబడులు పెరుగుతుండటమూ ప్రధాన కారణమని పేర్కొంటున్నారు.
ఈ ఏడాది తొలి అర్ధభాగంలో (జనవరిజూన్) 26 కంపెనీలు రూ.52,200 కోట్లు సమీకరించాయి. ఇందులో అత్యధికంగా హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్లు సమీకరించింది.
రాబోయే ప్రధాన కంపెనీల ఐపీఓల్లో టాటా కేపిటల్ రూ.17,200 కోట్లు, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రూ.15,000 కోట్లను సమీకరించే అవకాశం ఉంది.
ఫిన్‌టెక్ సంస్థ గ్రో కూడా ఐపీఓ ద్వారా రూ.5,950 కోట్లు సమీకరించేందుకు యోచన చేస్తోంది.




ఫోన్‌పే, మీషో, లెన్స్‌కార్ట్, బోట్, వుయ్‌వర్క్ ఇండియా, ఫిజిక్స్ వాలా, షాడోఫాక్స్ సహా మరిన్ని కొత్త తరం కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు రానున్నాయి. ఈ కంపెనీలు రూ.1,5009,000 కోట్ల శ్రేణిలో నిధులను సమీకరించే అవకాశం ఉంది.
పైన్ ల్యాబ్స్, అర్బన్ కంపెనీ, వేక్‌ఫిట్, షిప్‌రాకెట్, అమాగి, టేబుల్‌స్పేస్ లాంటి మరికొన్ని నవతరం కంపెనీలు కూడా పబ్లిక్ ఇష్యూకు వచ్చే సన్నాహాల్లో ఉన్నాయి. 2024లో 90 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.1.60 లక్షల కోట్లు సమీకరించాయి. తొలి అర్ధభాగంలో 34 కంపెనీలు రూ.29,607 కోట్లు, రెండో అర్ధభాగంలో 56 కంపెనీలు రూ.1.30 లక్షల కోట్లను సమీకరించడం గమనార్హం.

**రూ.1,75,000 కోట్ల విలువ ..టాటా కేపిటల్ ఐపీఓ!**

ఐపీఓ కోసం సంస్థ విలువను 1820 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1,75,000 కోట్లు)గా పెట్టుకోవాలని టాటా కేపిటల్ అనుకుంటోంది. ఇంతకుముందు 11 బిలియన్ డాలర్ల విలువను కంపెనీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీంతో పోలిస్తే తాజా విలువ చాలా ఎక్కువ. ఇటీవలి రైట్స్ ఇష్యూ, ఇతర కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు మదుపర్ల నుంచి విశేషణ ఆదరణ లభించడంతోనే.. సంస్థ విలువ పెంపునకు టాటా కేపిటల్ మొగ్గు చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా 2.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.19,000 కోట్లు) సమీకరించాలని టాటా కేపిటల్ అనుకుంటోంది. వచ్చే సెప్టెంబరులో ఈ ఐపీఓ ఉండొచ్చు.

**7 దరఖాస్తులకు సెబీ ఆమోదం**

తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) నిర్వహించే నిమిత్తం ఏడు కంపెనీలలకు సెబీ ఆమోద ముద్ర వేసింది. వీటిల్లో ఫిజిక్స్‌వాలా, సాత్విక్ గ్రీన్ ఎనర్జీ, వినీర్ ఇంజినీరింగ్, ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్, ఫుజియామా పవర్ సిస్టమ్స్, ఎస్ఐఎస్ క్యాష్ సర్వీసెస్, అన్లాన్ హెల్త్‌కేర్ ఉన్నాయి.
**ఫిజిక్స్‌వాలా:** విద్యా సాంకేతిక యూనికార్న్ సంస్థ ఇది. సెబీకి రహస్య ప్రిఫిల్లింగ్ పద్ధతిలో ఐపీఓ దరఖాస్తును సమర్పించింది. అందువల్ల ఐపీఓ వివరాలు బయటకు తెలిసే వీలుండదు.
**సాత్విక్ గ్రీన్ ఎనర్జీ:** హరియాణాకు చెందిన సౌర ఫలకాల తయారీ కంపెనీ ఇది. ఐపీఓ ద్వారా రూ.1,150 కోట్లను సమీకరించనుంది.
**ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్:** ముంబయికి చెందిన స్థిరాస్తి అభివృద్ధి సంస్థ ఇది. పబ్లిక్ ఇష్యూ కింద రూ.392 కోట్ల విలువైన తాజా షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ప్రమోటర్లు, ఒక వాటాదారు ఆఫర్ ఫర్ సేల్‌లో 28.57 లక్షల షేర్లను విక్రయించనున్నారు.
**వినీర్ ఇంజినీరింగ్:** ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ఈ కంపెనీ ప్రమోటరు నితిశ్ గుప్తా 5.44 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.
**ఫుజియామా పవర్ సిస్టమ్స్:** పై కప్పు సౌర ఉత్పత్తుల తయారీ సంస్థ ఇది. ఐపీఓలో భాగంగా రూ.600 కోట్ల విలువైన తాజా షేర్లను, ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు 2 కోట్ల షేర్లను విక్రయించనున్నారు.
**ఎస్ఐఎస్ క్యాష్ సర్వీసెస్:** నగదు నిర్వహణ సంబంధిత సేవలను నిర్వహించే ఈ కంపెనీ.. ఐపీఓలో భాగంగా రూ.100 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేయనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు 37.15 లక్షల షేర్లను విక్రయించనున్నారు.
**అన్లాన్ హెల్త్‌కేర్:** రసాయనాల తయారీ సంస్థ ఇది. 1.4 కోట్ల తాజా షేర్లను కంపెనీ జారీ చేయనుంది.
**ఐపీఓ కోసం సెబీకి 2 దరఖాస్తులు**దిల్లీ: హృద్రోగులకు వేసే స్టెంట్‌ల తయారీ సంస్థ సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ (ఎస్ఎంటీ) లిమిటెడ్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ఉంటుంది.

# నేను బిలియనీర్లను సృష్టించా: ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్

**తన మేనేజ్‌మెంట్ బృందంలో పెద్ద ఎత్తున బిలియనీర్లను తయారు చేసినట్లు ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ పేర్కొన్నారు. ప్రపంచంలో మరే ఇతర సీఈవోకు ఇది సాధ్యం కాలేదని తెలిపారు. ఆయన ఆల్-ఇన్ పాడ్‌కాస్ట్ బృందం, హిల్ అండ్ వ్యాలీ ఫోరమ్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.**

పరిమిత సంఖ్యలో చిన్న చిన్న కృత్రిమ మేధ పరిశోధక బృందాలతో ఎన్విడియా విజయాలు సాధించి.. ఆర్థిక ఫలాలను ఎలా అందుకుందో ఆయన వివరించారు. "నా మేనేజ్‌మెంట్ బృందంలో నేను చాలా మంది బిలియనీర్లను సృష్టించాను. ప్రపంచంలో మరే ఇతర సీఈవోకు ఇది సాధ్యం కాలేదు. వారంతా బాగానే చేస్తున్నారు. ముఖ్యమైన అంశం ఏమిటంటే.. దాదాపు 150 మంది కృత్రిమ మేధ పరిశోధకుల బృందాలు.. వారికి మెరుగైన ఫండింగ్‌తో అద్భుతాలు సృష్టించవచ్చు.

అదే కొంచెం పెద్ద బృందాలకు సరైన వసతులు సమకూర్చగలిగినా మంచి ఫలితాలు పొందొచ్చు. 150 మంది కృత్రిమ మేధ పరిశోధకులున్న కంపెనీకి 2030 బిలియన్ డాలర్లు చెల్లిస్తున్నప్పుడు.. వీటికి ఎందుకు ఇవ్వరు?" అని వ్యాఖ్యానించారు. చిన్న చిన్న ఏఐ పరిశోధక బృందాల ప్రభావం, వాటి విలువపై అడిగిన ప్రశ్నకు స్పందనగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. వాస్తవానికి చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐ ప్రారంభంలో కేవలం 150 మంది ఉండేవారు. ఇక చైనాలోని డీప్‌సీక్‌లో కూడా ఇంతే మంది సిబ్బంది ఉన్నారు.




ఇక అద్భుత పనితీరు ప్రదర్శించిన ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్స్, రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్స్ కేటాయింపుపై కూడా ఎన్విడియా సీఈవో సరదాగా స్పందించారు. వాటిని తన జేబులో నుంచే ఇస్తున్నానని చెప్పారు. ఇప్పటికీ ఉద్యోగులకు ఇచ్చే కాంపెన్సేషన్‌ను తాను పరిశీలిస్తానని చెప్పారు. ఇందుకోసం తాను ప్రత్యేక శైలిని అనుసరిస్తానన్నారు. దీంతోపాటు మెషీన్ లెర్నింగ్‌ను వాడతానన్నారు. తాను కంపెనీ నిర్వహణ వ్యయాలను పెంచినట్లు అంగీకరించారు. ఎందుకంటే ఉద్యోగులను చూసుకోవాల్సిన బాధ్యత ఉందని జెన్సన్ హువాంగ్ పేర్కొన్నారు.

# టీసీఎస్.. భారీగా లే ఆఫ్స్.. ఎవరిపై ప్రభావమంటే..!




**న్యూఢిల్లీ:** ఐటీ దిగ్గజ సంస్థల్లో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) భారీ లే ఆఫ్స్‌కు సిద్ధమైంది. ప్రస్తుతం సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులు కారణంగా భారీ తొలగింపునకు టీసీఎస్ సన్నద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా టీసీఎస్ కంపెనీల్లో పని చేస్తున్న ఉద్యోగాల్‌లో 2 శాతం లే ఆఫ్స్ కు సిద్ధమైన విషయాన్ని కంపెనీ ఆదివారం స్పష్టం చేసింది.
అంటే 12వేలకు పైగా ఉద్యోగులు తమ ఉద్యోగాల్ని కోల్పోనున్నారు. ఇది మధ్యస్థంగా ఉన్న ఉద్యోగులతో పాటు సీనియర్ స్థాయిల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ కె కృతివాసన్ స్పష్టం చేశారు. అయితే ఉద్యోగుల్ని తొలగించడం తమకు కూడా బాధగానే ఉందని, కాకపోతే మారిన టెక్నాలజీతో తొలగింపులు తప్పడం లేదన్నారు.

కొత్త టెక్నాలజీల పరంగా చూస్తే ముఖ్యంగా ఏఐ ఆపరేటింగ్ మోడల్ మార్పులను గుర్తిస్తున్నాం. పని చేసే విధానాలూ మారుతున్నాయి. అందుకే భవిష్యత్తుకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. అందుకోసం మేము ఏఐని ఉపయోగిస్తూ కావాల్సిన నైపుణ్యాలను మెరుగుపరిచే పనిలో ఉన్నాం. మా కంపెనీ విస్తరణ అవకాశాలను మెరుగుపరిచేందుకు ఎక్కువ శాతం పెట్టుబడులు పెట్టాం. కానీ, పలు విభాగాల్లో వృద్ధి కనిపించడం లేదు. దాంతో లే ఆఫ్స్ తప్పడం లేదు. ఇది ప్రపంచ వ్యాప్తంగా మా ఉద్యోగుల్లో సుమారు 2 శాతం మందిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా మధ్యస్థ, సీనియర్ స్థాయుల్లో ఉండే ఉద్యోగులపైనే ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ నిర్ణయం అనుకున్నంత ఈజీ కాదు. సీఈఓగా నేను తీసుకున్న అత్యంత కఠిన నిర్ణయాల్లో ఇదొకటి' అని కృతివాసన్ తెలిపారు.




# సెట్స్‌పైకి స్పిరిట్ అప్పుడే!

ఏకకాలంలోనే వరుస సినిమాలతో సెట్స్‌పై తీరిక లేకుండా గడుపుతున్నారు అగ్రహీరో ప్రభాస్. ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్ర పోషిస్తున్న 'రాజాసాబ్', 'ఫౌజీ' చిత్రాలు శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడాయన 'స్పిరిట్' సినిమాను పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రమిది. త్రిప్తి దిమ్రీ కథానాయికగా నటిస్తోంది. భూషణ్ కుమార్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణను సెప్టెంబరు నుంచి ప్రారంభించనున్నట్లు అధికారికంగా తెలిపింది చిత్రబృందం. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ప్రభాస్ పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది.

# తగ్గిన 'హరి హర వీరమల్లు' టికెట్లు రేట్లు.. ఎప్పటి నుంచి అంటే..



**హైదరాబాద్:** పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకులు. జులై 24న విడుదలైన ఈ మూవీకి మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. పవన్‌కల్యాణ్ నటన, యాక్షన్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ మూవీని మరింత మంది ప్రేక్షకులకు చేరువ చేసేందుకు చిత్ర బృందం నిర్ణయించింది. ఇందులో భాగంగా పెంచిన టికెట్ ధరలను అందుబాటులోకి తెచ్చింది. జులై 28వ తేదీ నుంచి సాధారణ ధరలకే 'వీరమల్లు' టికెట్లు లభించనున్నాయి. బుక్‌మై షో, డిస్ట్రిక్ యాప్‌లలో ఇప్పటికే ఈ మార్పులు చోటు చేసుకున్నాయి.
సినిమా విడుదల సందర్భంగా సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్‌లలో టికెట్ రేట్లు పెంచుకునేందుకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతి ఇచ్చాయి. ఈ క్రమంలో సోమవారం నుంచి ఎలాంటి పెంపు లేకుండా సాధారణ ధరకే టికెట్లు విక్రయిస్తున్నారు. సింగిల్ స్క్రీన్‌లలో బాల్కనీ రూ.175, మల్టీప్లెక్స్‌లలో రూ.295కే టికెట్లు లభించనున్నాయి.



# దీపికా పదుకొణెకు మరో గౌరవం.. ఆ జాబితాలో చోటు

కొన్ని రోజుల క్రితమే అరుదైన ఘనతను సాధించిన బాలీవుడ్ నటి దీపికా పదుకొణె .. తాజాగా మరో గౌరవం దక్కించుకున్నారు. ప్రముఖ మ్యాగజైన్ 'ది షిఫ్ట్' ప్రకటించిన ప్రభావవంతమైన మహిళల జాబితాలో నిలిచారు. క్రియాశీలత, సృజనాత్మకత, నాయకత్వం.. తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన ఈ లిస్ట్‌లో బాలీవుడ్ డైరెక్టర్ జోయా అక్తర్, హాలీవుడ్ నటీమణులు ఏంజెలినా జోలీ, సెలినా గోమెజ్ తదితరులున్నారు. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కూ దీపిక ఎంపికైన సంగతి తెలిసిందే. ఆ గౌరవం దక్కిన తొలి భారతీయ నటి దీపిక.

2018లో టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్' (ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు) లిస్ట్‌లోనూ ఆమె చోటు దక్కించుకున్నారు. 2022లో ఫుట్‌బాల్ ప్రపంచకప్‌ను ఆవిష్కరించి ప్రపంచాన్ని ఆకర్షించారు. నటిగా దీపికది దాదాపు 20 ఏళ్ల ప్రయాణం. ఇప్పటికీ హీరోయిన్‌గా రాణిస్తుండడం విశేషం. అల్లు అర్జున్ హీరోగా అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన సంగతి తెలిసిందే.



# 'సింధూరం'.. కృష్ణవంశీ నన్ను తిరస్కరించారు: శేఖర్ కమ్ముల

తన శైలికి భిన్నంగా 'కుబేర' ను తెరకెక్కించి, ప్రేక్షకులను మెప్పించారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ఈ క్రమంలోనే ఈటీవీ 'చెప్పాలని ఉంది' కార్యక్రమంలో పాల్గొన్నారు. కెరీర్ ప్రారంభ రోజులను గుర్తుచేసుకున్నారు. కృష్ణవంశీ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేయాలనుకున్నారా? అని అడగ్గా.. "యూఎస్‌లో ఫిల్మ్‌మేకింగ్ కోర్సు చేసే సమయంలో ఓ సారి ఇండియాకు వచ్చా. అప్పుడు 'నిన్నే పెళ్లాడతా' సినిమా చూశా. 'భలే తీశాడు సినిమా' అని అనుకుంటూ ఆయన వద్ద పని చేయాలని నిర్ణయించుకున్నా. 'సింధూరం' మూవీ సెట్స్‌లో ఆయన్ను కలిసి.. నేను అనుకున్నది చెప్పా. ఆ టైమ్‌కి సినిమా చిత్రీకరణ దాదాపు 30 శాతం అయిపోయింది. అప్పటికే పలువురు వర్క్ చేస్తుండడంతో.. ఆయన సున్నితంగా నన్ను తిరస్కరించారు. సినిమా షూటింగ్ మధ్యలో కొత్త వారిని తీసుకోవాల్సి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తర్వాత అర్థమైంది. కృష్ణవంశీతో అప్పటి నుంచి మంచి అనుబంధం ఏర్పడింది. నా సినిమాలని తొలుత ఆయనకు చూపిస్తుంటా" అని తెలిపారు.

"నాది సినీ నేపథ్య కుటుంబం కాదు. ఎక్కువగా సినిమాలూ చూసేవాడిని కాదు. పుస్తకాలు కూడా ఎక్కువగా చదవలేదు. నా కాలేజీ రోజుల్లో చిరంజీవి సినిమా షూటింగ్ జరుతుండగా.. పది వేల మందిలో ఆయన నన్ను పిలిచారు. వెంటనే ఆటోగ్రాఫ్ తీసుకున్నా. అది నాపై ప్రభావం చూపింది. సినిమాల్లోకి రావడానికి అదో కారణం" అని పేర్కొన్నారు. 'లీడర్' సినిమా విషయంలో తన తండ్రి గర్వంగా ఫీలయ్యారని చెప్పారు. ఈ చిత్రానికి సీక్వెల్ చేస్తానన్నారు. సినిమా రంగంపై ఏఐ ప్రభావంపై స్పందిస్తూ.. దాని వల్ల చాలా మార్పులొస్తాయన్నారు. నెగెటివ్‌గా అని చెప్పలేంగానీ కొత్త అనుభూతి పంచుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. **

# ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా సునీల్.. ఫైటర్ శివ ఫస్ట్‌లుక్ పోస్టర్ రిలీజ్

మణికంఠ, ఐరా బన్సాల్ హీరోహీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'ఫైటర్ శివ'. ప్రభాస్ నిమ్మల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సునీల్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడు. అరుణగిరి ఆర్ట్స్ మరియు కౌండిన్య ప్రొడక్షన్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇటీవల పూర్తయింది.
ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటుంది.
కాగా ఈ చిత్రం యొక్క ఫస్ట్ లుక్ పోస్టర్ని దర్శకులు సంపత్ నంది గారి చేతుల మీదుగా నేడు విడుదల చేశారు. ఈ చిత్రంలో మధుసూదన్, యోగి కాట్రి ,దిల్ రమేష్ ,లక్ష్మణ్ ,అభయ్ ,ఆనంద్ భారతి, ఘర్షణ శ్రీనివాస్ మాస్టర్ శన్విత్ నిమ్మల తదితర నటీనటులు నటించారు.



# క్రైమ్ థ్రిల్లర్‌గా వరుణ్ సందేశ్ మూవీ.. గ్రాండ్‌గా ప్రారంభం!

**వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'వన్ వే టికెట్'. ఈ సినిమాకు ఏ. పళని స్వామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ పద్మ ఫిల్మ్స్, రంగస్థలం మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీకి జొరిగే శ్రీనివాసరావు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో వరుణ్ సందేశ్ సరసన కుష్బూ చౌదరి కనిపించనుంది.**



తాజాగా ఈ మూవీ గ్రాండ్‌గా ప్రారంభమైంది. హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ నిర్మాత సి. కళ్యాణ్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా.. హర్షిత్ రెడ్డి స్క్రిప్ట్ అందజేశారు. దర్శక, నిర్మాత త్రినాధరావు నక్కిన తొలి సన్నివేశానికి కెమెరా స్విచ్ ఆన్ చేశారు.
**నక్కిన త్రినాధరావు మాట్లాడుతూ** .. 'మా వరుణ్ సందేశ్ చిత్ర ప్రారంభోత్సవానికి రావడం నాకు ఆనందంగా ఉంది. వరుణ్ సందేశ్ వైభోగం ఒకప్పుడు నేను చాలా చూశా. మా డార్లింగ్ వరుణ్ సందేశ్‌కు ఓ హిట్ అవ్వాలన్నదే నా కల. ఈ 'టికెట్' మూవీ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

**వరుణ్ సందేశ్ మాట్లాడుతూ** .. 'వన్ వే టికెట్ టైటిల్ విన్న వెంటనే నాకు కొత్తగా అనిపించింది. పళని చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. ఇందులో కొత్త పాత్రను పోషించబోతోన్నాను. ఈ స్క్రిప్ట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. మా సినిమాకు కార్తీక్ మంచి మెలోడీస్ ఇవ్వబోతోన్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభించబోతున్నాం' అని అన్నారు.

ఈ వన్ వే టికెట్ మూవీ క్రైమ్ థ్రిల్లర్‌గా ఉంటుందని దర్శకుడు పళని స్వామి తెలిపారు. కాగా.. ఈ చిత్రంలో మనోజ్ నందం, సుధాకర్, రామ్ తిరుపతి ముఖ్య పాత్రల్ని పోషించనున్నారు. ఈ మూవీకి సంగీత దర్శకుడిగా కార్తిక్ పనిచేస్తున్నారు.



## ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్
## రెండో గేమ్ డ్రా..
## ఫలితం తేల్చనున్న టైబ్రేకర్

**బాటుమి: ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్ గేమ్ ఆసక్తికరంగా సాగుతోంది. తొలి గేమ్‌ను డ్రాగా ముగించిన భారత అమ్మాయిలు కోనేరు హంపి, దివ్య దేశముఖ్ రెండో గేమ్‌ను కూడా డ్రా చేశారు. దీంతో ఫలితం తేల్చేందుకు సోమవారం టై బ్రేకర్ ఆడనున్నారు. తొలి గేమ్‌లో నల్లపావులతో ఆడిన హంపి.. ఇవాళ తెల్లపావులతో ఆడింది. ఇది కొంత సానుకూల అంశమైనప్పటికీ.. దివ్య దేశ్‌ముఖ్ అదే స్థాయిలో ప్రతిస్పందించడంతో గేమ్‌ను డ్రాగా ముగించక తప్పలేదు.**











## నితీశ్ సన్‌రైజర్స్‌ను వీడతాడని వార్తలు.. స్పందించిన క్రికెటర్

తెలుగు కుర్రాడు, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంఛైజీకి ఆడుతున్న సంగతి తెలిసిందే. గతేడాది జరిగిన మెగా వేలానికి ముందు నితీశ్‌ను సన్‌రైజర్స్ రూ.6 కోట్లకు అట్టిపెట్టుకుంది. అయితే, అతను హైదరాబాద్ ఫ్రాంఛైజీని వీడాలనుకుంటున్నట్లు వార్తలొస్తున్నాయి. ఆల్‌రౌండర్‌గా తనకు సరైన అవకాశాలు రాకపోవడంతో అసంతృప్తితో ఉన్నాడని, కొత్త ఫ్రాంఛైజీకి మారబోతున్నాడని ఆ వార్తల సారాంశం. కానీ, ఆ వార్తలను నితీశ్ రెడ్డి కొట్టి పారేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తనకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని, ఎల్లప్పుడూ ఈ జట్టుకు విధేయుడిగా ఉంటానని పేర్కొన్నాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో నితీశ్ పోస్టు పెట్టాడు. ఈ సీజన్‌లో నితీశ్ 13 మ్యాచ్‌లు ఆడి 182 పరుగులు చేశాడు. ఐదు ఓవర్లు బౌలింగ్ చేసి రెండు వికెట్లు పడగొట్టాడు.

# గిల్, జడేజా, సుందర్ వీరోచిత శతకాలు..
# డ్రాగా ముగిసిన నాలుగో టెస్ట్





**ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ మధ్య మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో మ్యాచ్ డ్రాగా ముగిసింది. 311 పరుగులు వెనుకపడి రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన భారత్ (నాలుగో రోజు).. ఖాతా తెరవకుండానే యశస్వి జైస్వాల్ (0), సాయి సుదర్శన్ (0) వికెట్లు కోల్పోయినప్పటికీ వీరోచితంగా పోరాడింది.**

తొలుత కేఎల్ రాహుల్ (90), శుభ్‌మన్ గిల్ (103) అద్భుతంగా బ్యాటింగ్ చేసి మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 188 పరుగులు జోడించగా.. ఆతర్వాత వాషింగ్టన్ సుందర్ (101 నాటౌట్), రవీంద్ర జడేజా (107 నాటౌట్) వీరోచిత శతకాలు బాది మ్యాచ్‌ను డ్రా చేశారు. సుందర్‌జడేజా జోడీ ఐదో వికెట్‌కు అజేయమైన 203 పరుగులు జోడించింది. ఫలితంగా భారత్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసింది.

అంతకుముందు ఇంగ్లండ్‌తో తొలి ఇన్నింగ్స్‌లో 669 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (150), బెన్ స్టోక్స్ (141) భారీ శతకాలతో కదంతొక్కగా.. జాక్ క్రాలే (84), బెన్ డకెట్ (94) సెంచరీలకు చేరువలో ఔటయ్యారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 4, బుమ్రా, సుందర్ తలో 2, అన్షుల్ కంబోజ్, సిరాజ్ చెరో వికెట్ పడగొట్టారు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ 58, కేఎల్ రాహుల్ 46, సాయి సుదర్శన్ 61, రిషబ్ పంత్ 54, శార్దూల్ ఠాకూర్ 41 రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ 5 వికెట్లు తీశాడు.

నాలుగో టెస్ట్ డ్రా కావడంతో సిరీస్‌లో ఇంగ్లండ్ ఆధిపత్యం 21తో కొనసాగుతుంది. చివరిదైన ఐదో టెస్ట్ జులై 31 నుంచి లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్‌లో ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌లో ఒకటి, మూడు మ్యాచ్‌లు ఇంగ్లండ్ గెలువగా.. భారత్ రెండో మ్యాచ్‌లో విజయం సాధించింది.

### సెంచరీ చేసి ఔటైన శుభ్‌మన్ గిల్..
### లంచ్ బ్రేక్.. భారత్ 223/4

**మాంచెస్టర్:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో ఓటమిని తప్పించుకుని మ్యాచ్‌ను డ్రా చేసుకునేందుకు టీమ్‌ఇండియా గట్టిగా పోరాడుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో 174/2తో ఐదో రోజు ఆటను ప్రారంభించిన భారత్.. భోజన విరామ సమయానికి నాలుగు వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103; 238 బంతుల్లో 12 ఫోర్లు) ఈ సిరీస్‌లో నాలుగో సెంచరీ చేసి ఔటయ్యాడు. కేఎల్ రాహుల్ (90; 230 బంతుల్లో 8 ఫోర్లు) ఓవర్‌నైట్ స్కోరుకు మరో మూడు పరుగులే జోడించి వెనుదిరిగాడు. ఆటను మొదలయ్యాక ఎనిమిదో ఓవర్‌లో రాహుల్‌ని స్టోక్స్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. లంచ్ బ్రేక్ ముంగిట శుభ్‌మన్‌ను ఆర్చర్ పెవిలియన్‌కు పంపాడు. ప్రస్తుతం క్రీజులో వాషింగ్టన్ సుందర్ (21*; 61 బంతుల్లో), రవీంద్ర జడేజా (0*) ఉన్నారు. ఇంగ్లాండ్ స్కోరును చేరుకునేందుకు భారత్ ఇంకా 88 పరుగుల వెనుకంజలో ఉంది. మిగిలిన రెండు సెషన్లపాటు ఇంగ్లాండ్ బౌలర్లు కాచుకోని ఆలౌట్ కాకుండా ఉండటం భారత బ్యాటర్లకు సవాలుతో కూడుకున్నదే. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 669 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.



# 39 బంతుల్లో శతక్కొట్టిన ఏబీడి..
# ఆసీస్‌ను చిత్తు చేసిన సౌతాఫ్రికా

**వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్-2025లో సౌతాఫ్రికా లెజెండ్స్ వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. ఇవాళ (జులై 27) ఆస్ట్రేలియా లెజెండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 95 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. తద్వారా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించారు.**



ఈ మ్యాచ్ ఫలితంతో సౌతాఫ్రికాతో పాటు పాకిస్తాన్, ఆస్ట్రేలియా కూడా సెమీస్‌కు అర్హత సాధించాయి. నాలుగో బెర్త్ కోసం వెస్టిండీస్, ఇంగ్లండ్, భారత్ మధ్య పోటీ జరుగుతుంది. ఈ టోర్నీలో భారత్ ఆడిన 3 మ్యాచ్‌ల్లో రెండు ఓడి ప్రస్తుతం చివరి స్థానంలో ఉంది. పాకిస్తాన్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను భారత్ రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. ఇవాళ రాత్రి భారత్ ఇంగ్లండ్‌తో తలపడుతుంది.

**డివిలియర్స్ మహోగ్రరూపం**

ఆసీస్‌తో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా.. ఏబీ డివిలియర్స్ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో అతి భారీ స్కోర్ చేసింది. ఏబీడి కేవలం 39 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి విధ్వంసం సృష్టించాడు. ఈ ఇన్నింగ్స్‌లో మొత్తంగా 46 బంతులు ఎదుర్కొని 15 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 123 పరుగులు చేశాడు. ఏబీడీతో పాటు మరో ఓపెనర్ జేజే స్మట్స్ కూడా సునామీ ఇన్నింగ్స్‌తో (53 బంతుల్లో 85; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) విరుచుకుపడటంతో సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 6 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది.

అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా.. ఆరోన్ ఫాంగిసో (3.40134), ఇమ్రాన్ తాహిర్ (40273) చెలరేగడంతో 16.4 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో బెన్ కటింగ్ ఆఖర్లో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కటింగ్ 29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో అజేయమైన 59 పరుగులు చేశాడు.

**అంతకుముందు 41 బంతుల్లో..!**

WCL 2025లో ఏబీడీ తొలి మ్యాచ్ నుంచే అరివీర భయంకరమైన ఫామ్‌లో ఉన్నాడు. భారత్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 30 బంతుల్లో అజేయమైన 63 పరుగులు చేసిన అతను.. మూడు రోజుల కిందట ఇంగ్లండ్‌పై 41 బంతుల్లోనే శతక్కొట్టాడు. ఆ మ్యాచ్‌లో మొత్తంగా 51 బంతులు ఎదుర్కొన్న ఏబీడీ అజేయమైన 116 పరుగులు చేశాడు.